సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 22 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి. మార్కెట్‌కు 379 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 మేర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.8°/16.1°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

హిందూపురం: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్



పుట్టపర్తి టౌన్: తెలుగు సంవత్సరాది ఉగాదిని ఘనంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. జీవిత గమనంలో కష్టసుఖాలను ప్రతిబింబించే షడ్రుచుల సమ్మేళనంతో ఈ పండుగ జరుపుకుంటారు. శోభకృత్ నామ ఉగాది నేపథ్యంలో నూతన వస్త్రాలతో పాటు పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు జనం ఉత్సాహం చూపగా మార్కెట్లు కిటకిటలాడాయి. ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పుట్టపర్తి శిల్పారామంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పాలనాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్‌లో ఉగాది మహోత్సవం

పుట్టపర్తి అర్బన్: కలెక్టర్ బసంత్‌కుమార్ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లూ సుఖ సంతోషాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం

- రాగిజావ పంపిణీ ప్రారంభోత్సవంలో కలెక్టర్ బసంత్‌కుమార్
- ప్రభుత్వానికి సహకరిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌కు ప్రశంస
- జిల్లాలోని 1,46,311 మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ



రాగి జావ రుచి చూస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఆర్‌జే రత్నాకర్, ఎంపీ గోరంట్ల మాధవ్

ప్రశాంతి నిలయం: 'జగనన్న గోరుముద్ద'లో కొత్తగా చేర్చిన రాగిజావతో విద్యార్థులకు పౌష్టికాహారం లభించి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లాకు సంబంధించిన కార్యక్రమాన్ని కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, కలెక్టర్ బసంత్‌కుమార్, ఉమ్మడి అనంతపురం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.... విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, తద్వారా వారు చదువుల్లోనూ రాణిస్తారన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని 2,031 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలవుతోందన్నారు. ఈ పథకం ద్వారా 1,46,311 మంది విద్యార్థులు సంపూర్ణ పోషక ఆహారాన్ని పొందుతున్నారన్నారు. కొత్త మెనూలో భాగంగా వారానికి ఐదు సార్లు కోడిగుడ్లు, మూడు రోజులు వేరుశనగ చిక్కీలు, రాగిజావ ఇస్తామన్నారు. ఆహారాన్ని భగవంతుడిని నైవేద్యంగా సమర్పించి సేవిస్తే అది ప్రసాదం అవుతుందని, ఈ ప్రసాదాన్నే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రాగిజావ రూపంలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అందిస్తోందన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో భాగస్వామిగా మారిన సత్యసాయి ట్రస్ట్‌ను అభినందించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, నేషనల్ సేవా కోఆర్డినేటర్, గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు చలం, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్డీఓ భాగ్యరేఖ, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, సర్పంచ్ రాధా, ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి, తహసీల్దార్ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

జగన్ మామకు థ్యాంక్స్



మాలాంటి పేద విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లో 15 రకాల ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు. దానికి తోడు రాగిజావ ఇవ్వడం ఎంతో సంతోషం, మా కోసం నిత్యం శ్రమిస్తున్న జగన్ మామకు థ్యాంక్స్.

–వర్షిణి, 9వ తరగతి, కొత్తచెరువు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

హిందూపురం: పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ పొందుతున్న విద్యార్థులు వెంటనే తమ బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి శివరంగప్రసాద్ మంగళవారం ప్రకటనలో సూచించారు. బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసుకోకపోతే స్కాలర్‌షిప్ మొత్తం జమ కాదన్నారు. ఈ మేరకు ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇంకా 1,641 మంది విద్యార్థులు ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసుకోలేదన్నారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెనకు సంబంధించిన మొత్తం కూడా విద్యార్థుల తల్లులు ఖాతాకే రాష్ట్ర ప్రభుత్వమే జమ చేస్తుందని, ఇందుకు కూడా తప్పనిసరిగా తల్లుల బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. జిల్లాలో 238 మంది తల్లులు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రశాంతి నిలయం: ఇంటర్ పరీక్షలు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం 99 కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 31,102 మందికి గాను, 30349 మంది హాజరయ్యారు. 753 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 28,919 మందికి గాను 28,250 మంది హాజరుకాగా, 669 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 2,183 మందికి గాను 2,099 మంది హాజరుకాగా, 84 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం

కదిరి అర్బన్: మండల పరిధిలోని మొటుకుపల్లి సమీపంలో మంగళవారం ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి అనంతపురానికి చెందిన సుధాకర్ (42) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. సుధాకర్‌కు మతి స్థిమితం లేనట్లు వెల్లడైందని రైల్వే పోలీసులు తెలిపారు. ఈ నెల 19న అనంతపురంలో ఆయన అదృశ్యమయ్యాడని, బంధువులు అతని కోసం వెతుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రాఘవులు

కదిరి అర్బన్: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు కోరారు. మంగళవారం కదిరి మండలంలో మూర్తిపల్లి, వరిగిరెడ్డిపల్లి, బత్తలపల్లిలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సుమారు 250 ఎకరాలపైబడి పంట నష్టం వాటిల్లిందన్నారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రాంభూపాల్, జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నారపు బళ్లు.. పడమటి వీరన్నకే చెల్లు..



పడమటి వీరన్న స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



టెంకాయ పట్టలతో ముస్తాబు చేసిన ట్రాక్టర్‌లో పోట్లమర్రి నుంచి వెళ్తున్న ప్రజలు

బత్తలపల్లి/తాడిమర్రి: తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామ సమీపంలో కొలువైన పడమటి వీరన్న దర్శనానికి పన్నారపుబండ్లలో రైతులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మూగజీవాల పట్ల కరుణ చూపే స్వామి దర్శనానికి పోటెత్తారు. స్వామిని మొక్కుకుంటే పశువులకు కీడు జరగదన్నది ప్రజల విశ్వాసం. ఆవులు, గేదెలు ప్రసవించిన మొదటి రోజున పాలను ఆయనకు సమర్పించడం ఆనవాయితీ. గ్రామాల్లో పోట్లాటలు, దొంగతనాలు జరిగినప్పుడు ఆయన చెంత ప్రమాణం చేయిస్తే నిజాలు బహిర్గతమవుతాయన్నది విశ్వాసం. దీంతో ఉగాది ముందు రోజైన మంగళవారం పడమటివీరన్న దర్శనానికి బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి, ధర్మవరం, అనంతపురం మండలాల నుంచి అధికంగా రైతులు పన్నారపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని తరలివెళ్లారు. ప్రతి ఇంటి నుంచి పిటికెడు బియ్యం, బేడలు, బెల్లం తీసుకెళ్లి సమర్పించారు. ఇలా సమర్పించినవే బస్తాలుగా పోగవుతాయి. ఉగాది పండుగ అనంతరం వీటితో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం చేస్తారు.

వర్షపు నీరు నిల్వకుండా చూడండి

● ఎంపీ గోరంట్ల మాధవ్



ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

సాక్షి, పుట్టపర్తి: కొత్తచెరువు మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రైల్వే ట్రాక్ కారణంగా వర్షపు నీరు నిలిచిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ తెలిపారు. సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రశాంతినిలయం రైల్వే స్టేషన్ సతీష్ రెడ్డికి సూచించారు. 'రాగిజావ' ప్రారంభోత్సవానికి మంగళవారం కొత్తచెరువుకు వచ్చిన ఎంపీని పలువురు స్థానికులు కలిసి సమస్య తెలియజేశారు. నీటిని రైల్వే ట్రాక్ దాటిస్తే సమస్య తీరుతుందన్నారు. స్పందించిన ఎంపీ మాధవ్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి మేనేజర్‌తో మాట్లాడారు. స్టేషన్ మేనేజర్ సతీశ్‌రెడ్డి స్పందించి వెంటనే ఫోన్‌లో ఐఓయూ అధికారి సతీశ్‌తో మాట్లాడారు. రైల్వే శాఖాధికారుల నుంచి అనుమతులు తీసుకుంటేనే పైప్‌లైన్ ద్వారా వర్షపు నీటిని ట్రాక్ దాటించడం సాధ్యమవుతుందని చెప్పారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో సమాచారం అందజేస్తానని సతీశ్ తెలిపారు. ఎంపీ మాధవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని సూచించారు. అనంతపురం నుంచి బెంగళూరుకు పుట్టపర్తి మీదుగా మరో రైలు తీసుకొచ్చేందుకు కేంద్ర రైల్వే శాఖాధికారులతో మాట్లాడతానన్నారు. యలహంక నుంచి పుట్టపర్తి వరకూ రోజూ తిరిగే ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగించే విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన 'డెమో'



రైలు వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు

అనంతపురం సిటీ: గుంతకల్లు నుంచి హిందూపురానికి మంగళవారం సాయంత్రం బయలుదేరిన డెమో (ప్యాసింజర్ రైలు) 5.40 గంటలకు అనంతపురం సమీపంలోని నేషనల్ పార్క్ వద్దకు చేరుకోగానే సాంకేతిక సమస్య (ఎయిర్ డ్రాప్ లోపం) తలెత్తడంతో ఆగిపోయింది. ఏం జరిగిందో అర్థం కాక ఆందోళనకు గురైన ప్రయాణికులు కాసేపటి తర్వాత కాలి నడకన అనంతపురానికి చేరుకున్నారు. రైల్వే అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందంటూ విమర్శించారు. సమాచారం తెలుసుకున్న అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ ప్రసాద్, జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ మధు, సిబ్బంది అక్కడకు చేరుకుని బ్రేక్ డౌన్‌కు కారణాలు ఆరా తీశారు. అనంతరం గుంతకల్లు నుంచి మరో ఇంజిన్‌ను తెప్పించి రాత్రి 8.45 గంటలకు రైలును సాగనంపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

ధర్మవరం అర్బన్: బెంగళూరు నుంచి కడపకు అక్రమంగా తరలిస్తున్న రూ.1.50 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పట్టణంలోని సెబ్ స్టేషన్‌లో మంగళవారం సెబ్ సీఐ విలేకరులతో మాట్లాడారు. బెంగళూరుకు చెందిన శ్రీనివాసులు, కరుణాకరన్ మంగళవారం ఉదయం టాటా ఇండికా కారులో కడపకు రూ.1.50 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టణంలోని ప్యాదిండి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి మద్యం, కారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గతంలో శ్రీనివాసులుపై హిందూపురం సెబ్ స్టేషన్‌లో అక్రమ మద్యం కేసు ఉందన్నారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెల్ఫీలకే పరిమితమైన లోకేష్

నల్లమాడ: యువగళం పేరుతో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం మండలంలోని పులగంపల్లి మీదుగా 12 కిలోమీటర్లు సాగింది. ఓడీ చెరువు మండలపరిధిలోని మిట్టపల్లి మీదుగా వణుకువారిపల్లికి వెళ్లే రహదారిలో ఏర్పాటుచేసిన రాత్రి బస కేంద్రానికి సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. విడిది కేంద్రం వద్ద, పులగంపల్లి, మిట్టపల్లి బస్టాప్‌లో కార్యకర్తలు, మహిళలతో సెల్ఫీలు దిగడానికే లోకేష్ ఎక్కువ మక్కువ చూపారు.మిట్టపల్లి వద్ద కొద్దిసేపు దివ్యాంగులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. లోకేష్ వెంట మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

గాండ్లపెంట: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) ఎస్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించే సేవలు, ల్యాబ్ రికార్డులు, ఆరోగ్య కేంద్రానికి సరఫరా చేసిన మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాలా సంతృప్తికర సేవలు అందేలా చూడాలని వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాఫకృద్దీన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఐనోద్దీన్‌ఖాన్, యూడీసీ ఫైరోజ్, సూపర్‌వైజర్‌లు ఉపేంద్రారెడ్డి, నూర్జహాన్, ఫార్మసిస్ట్ ప్రకాష్ తదితరులున్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

ఎన్‌పీకుంట: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించకూడదని డీఎంఅండ్‌హెచ్‌ఓ కేవీ కృష్ణారెడ్డి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ధనియానిచెరువు ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోజువారి ఓపీ వివరాల గురించి వైద్యాధికారులతో ఆరా తీశారు. ఫార్మసీలోని స్టాక్ పాయింట్, రికార్డులు, ఆక్సిజన్ నిల్వలు, డెలివరీ వార్డు, ల్యాబ్ గదులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఐనొద్దీన్‌ఖాన్, ఆర్అండ్‌బీ డీఈఈ శైలజ, మండల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ ఆసియా, పీహెచ్‌ఎన్ శాంతమ్మ, గురుదేవి, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ రవి, ఆరోగ్యకార్యకర్త రమేష్‌రెడ్డి, ప్రసాద్, ఫైరోజ్ తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ఉగాది సందడి



యూత్ వింగ్ సావనీర్‌ను విడుదల చేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో శోభకృత నామ సంవత్సర ఉగాది పర్వదిన సందడి నెలకొంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వందలాది సత్యసాయి సేవా సంస్థల యువత మంగళవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వరార్చన పేరుతో నిర్వహించిన సంగీత కచేరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సత్యసాయి యూత్ లోగో, సత్యసాయి యూత్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పలు సేవా కార్యక్రమాలతో రూపొందించిన సావనీర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.